అభివృద్ధి వ్యూహాలు

వివిధ ప్రత్యామ్నాయాలలో, ఆ దేశ పరిస్థితులకనుగుణంగా ఉత్తమమైన వృద్ధివిధానాన్ని ఎన్నుకోవటమే వ్యూహం.

1. బిగ్‌పుష్ (Big Push) : దీనిని రోజెన్‌స్టీన్ రోడాన్ ప్రతిపాదించాడు. సంప్రదాయ శాస్త్రవేత్తలు పట్టించుకోని అవిభాజ్యాలకు, తద్వారా జనించే బాహ్య ఆదాలకు ప్రాముఖ్యత ఇచ్చి.. ఆర్థిక వ్యవస్థకు చలన సమతౌల్య పరిస్థితి కల్పించిన శాస్త్రవేత్త రోడాన్. అల్పాభివృద్ధి దేశాలు ఆటంకాలను అధిగమించి, వృద్ధి మార్గంలో పయనించాలంటే భారీగా పెట్టుబడులు అవసరం. ఆర్థిక వ్యవస్థకు కనీస స్థాయిలో కలిగించే ఈ ఊపునే 'బిగ్‌పుష్' అంటారు. రోడాన్ ప్రకారం ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి ఫలంలోనూ, డిమాండ్‌లోనూ, పొదుపు సప్లయ్‌లోనూ అవి భాజ్యాలుంటాయి. ప్రఖ్యాతి చెందిన 'పాదరక్షకుల పరిశ్రమ ఉదాహరణ' రోడాన్‌దే.

2. సంతులిత వృద్ధి సిద్ధాంతం : రోడాన్, ఆర్థర్ లూయిస్, రాగ్నార్ నర్క్‌సేలు ఈ సిద్ధాంతాన్ని సమర్థించినప్పటికీ.. దీనికి ముఖ్యకారకుడుగా 'రాగ్నార్ నర్క్‌సే'ను పేర్కొనవచ్చు. **'Problems of capital formation in under developed countries'** అనే గ్రంథంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు 'పేదరిక విషవలయం'లో చిక్కుకుంటాయని, దీనికి కారణం మూలధనం కొరత అని పేర్కొన్నాడు. అల్పఉత్పాదకత-అల్పాదాయం-అల్పపొదుపు-అల్పపెట్టుబడి-అల్ప మూలధనకల్పన తిరిగి అల్ప ఉత్పాదకతకు దోహదపడతాయని పేర్కొన్నాడు. ఈ పేదరిక విషవలయాలు అల్పఉత్పాదకత-అల్పాదాయాల మధ్య సంబంధాన్ని సూచిస్తాయి. పేదరిక విషవలయాలను తొలగించేందుకు ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాలలో ఒకేసారి పెట్టుబడి పెట్టి మార్కెట్‌ను విస్తరించాలన్నాడు. దీనినే 'సంతులిత వృద్ధి' అంటారు. వ్యవసాయరంగంలో ఉన్న ప్రచ్ఛన్న నిరుద్యోగులను నిజపొదుపుగా వాడి, మూలధన కల్పనకు ఉపయోగించవచ్చని పేర్కొన్నాడు.

3. అసంతులిత వృద్ధి సిద్ధాంతం : వెనకబడిన దేశాలలో మూలధన కొరత వల్ల అన్ని రంగాలలో ఒకేసారి పెట్టుబడి పెట్టలేమని 'హర్ష మన్' వాదించాడు. కొన్ని ఎంపి కచేసిన రంగాలలో మొదట పెట్టుబడి పెట్టి, వాటిని అభివృద్ధి చేసి వాటి ద్వారా లభించిన ఆదాయాలను మిగిలిన రంగాలకు వినియోగించి అసంతులిత బాట నుంచి క్రమంగా సంతులిత బాట వైపు పయనించే అభివృద్ధి వ్యూహాన్ని 'అసంతులిత వృద్ధి' సిద్ధాంతం అంటారు. సాంఘిక వ్యవస్థాపరమైన మూలధనం(SOC)లో గానీ, ప్రత్యక్ష ఉత్పాదక కార్యక్రమం (DPA)లో గానీ పెట్టు బడులు పెట్టడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో అసంతులితను సృష్టించవచ్చు. DPA కంటే SOC లో చేసే పెట్టుబడులు మెరుగైనవి. హర్ష్‌మన్ 'ముందు-వెనక అనుబంధాలు' (Forward and Backward Linkages)ను పేర్కొన్నాడు. మొదటగా అత్యధిక 'ముందు-వెనక అనుంబంధాలు' గల పరిశ్రమలలో పెట్టుబడి పెట్టాలని సూచించాడు. హర్ష్‌మన్ ప్రకారం అత్యధిక 'ముందు-వెనక అనుబంధాలు' గల పరిశ్రమ ఇనుము-ఉక్కు పరిశ్రమ.

4. అపరిమిత శ్రామిక సప్లయ్ సిద్ధాంతం : వెనకబడిన దేశాలలో శ్రామిక మిగులు ఎక్కువగా ఉండటంతో తక్కువ వేతనాలకే వీరు లభ్యమౌతారు. జీవనాధార రంగంలో ఉన్న వీరిని పెట్టుబడిదారీ రంగానికి తరలించి మూలధన కల్పనకు దోహదపడవచ్చని 'అపరిమిత శ్రామిక సప్లయ్' సిద్ధాంతాన్ని 'లూయిస్' ప్రతిపాదించాడు.

ఇతర వృద్ధి సిద్ధాంతాలు : అల్పస్థాయి సమతౌల్య స్థంబన (Low Level equilibrium trap) దీనిని 'నెల్సన్' ప్రతిపాదించాడు. వెనుకబడిన దేశాలు జీవనాధార స్థాయి తలసరి ఆదాయం వద్ద సమతౌల్యంలో ఉంటాయి. జాతీయాదాయాన్ని పెంచటానికి చేసే కృషి వల్ల జనాభా పెరిగి తలసరి ఆదాయాన్ని తిరిగి జీవనాధార స్థాయికి చేరుస్తుంది. అందుకే దీనిని 'అల్పస్థాయి సమతౌల్య బోను' అంటారు.

కనీస కృషి సిద్ధాంతం (Critical minimum effort) : వెనకబడిన దేశాలు పేదరిక విషవలయంలో బంధీలై తక్కువస్థాయి తలసరి ఆదాయ సమతౌల్యంలో ఉంటాయి. దీనిని అధిగమించి స్వయంసమృద్ధి సాధించేందుకు కావలసిన కనీస పెట్టుబడే 'కనీస కృషి సిద్ధాంతం'. దినిని హెచ్.లైబిన్ స్టీన్ ప్రతిపాదించాడు.

బ్యాక్‌వాష్ ఎఫెక్ట్ (Back wash effect) : ప్రాంతీయ అసమానతలు ఏర్పడటానికి బలంగా ఉండే బ్యాక్‌వాష్ ప్రభావం, బలహీనంగా ఉండే విస్తరణ ప్రభావాన్ని అధిగమించడమే కారణమని 'గున్నార్ మిర్థాల్' పేర్కొన్నాడు.

ప్రాక్టీస్ బిట్స్

1. జాబితా-1ని (ఆర్థికవేత్త), జాబితా-2 (భావన /సిద్ధాంతం)తో జత చేయండి?(సివిల్స్ 2008)

జాబితా-1	జాబితా-2
ఎ) రాగ్నార్ నర్క్సే	1) బ్యాక్‌వాష్ ఎఫెక్ట్
బి) రోజెన్‌స్టీన్ రోడాన్	2) సంతులిత వృద్ధి
సి) గున్నార్ మిర్థాల్	3) బిగ్‌పుష్ సిద్ధాంతం
డి) ఎ.ఒ. హర్ష్‌మన్	4) అసంతులిత వృద్ధి

	ఎ	బి	సి	డి
ఎ)	2	1	3	4
బి)	4	3	1	2
సి)	2	3	1	4
డి)	4	1	3	2

2. వేతన వస్తు నమూనాను అభివృద్ధి చేసింది ఎవరు? (సివిల్స్ 2008)

ఎ) మారిస్ డాబ్ బి) ఎ.కె. సెన్

సి) వకీల్, బ్రహ్మానందం డి) పి.సి. మహలనోబిస్

3. జాబితా-1(భావన), జాబితా-2తో(వివరణ) జత చేయండి? (సివిల్స్ 2008)

జాబితా-1 (భావన)	జాబితా-2 (వివరణ)
ఎ) పేదరికపు విషవలయం	1) అల్పాభివృద్ధి దేశాలలో ప్రారంభ ఆర్థికాభివృద్ధి సాధనకు భారీగా పెట్టుబడి పెట్టడం
బి) సంతులిత వృద్ధి	2) అల్పస్థాయి పెట్టుబడి స్తంభన
సి) బిగ్‌పుష్	3) అంతర్ సంబంధం కలిగిన పరిశ్రమలలో ఒకేసారి పెట్టుబడి పెట్టడం

	ఎ	బి	సి
ఎ)	2	3	1
బి)	1	2	3
సి)	2	1	3
డి)	1	3	2

4. పేదరిక విషవలయం అనే భావన ఎవరితో ముడిపడి ఉంది? (A.S.O 2008)

ఎ) లూయిస్ బి) లైబెన్ స్టీన్

సి) నర్క్సే డి) రోస్టావ్

5. పెద్ద ఊపు (Big Push) సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది?

ఎ) హర్ష్‌మన్ బి) రోడాన్

సి) షుంపీటర్ డి) లూయిస్

6. సంతులిత వృద్ధి గురించి తెలిపిన వారు? (A.S.O. 2008)

ఎ) హర్ష్‌మన్ బి) నర్క్సే

సి) సింగర్ డి) సోలో

7 అసంతులితవృద్ధి గురించి చెప్పినవారు? (A.S.O. 2008)

ఎ) నర్క్స్ బి) రోడాన్

సి) హర్ష్‌మన్ డి) సోలో

8. దీని గురించి మహలనోబిస్ అభివృద్ధి వ్యూహం ప్రధానంగా పేర్కొంది? (A.S.O. 2008)

ఎ) భారీ పరిశ్రమ వృద్ధి బి)దారిద్ర్య నిర్మూలన

సి) చిన్నతరహా రంగ వృద్ధి డి) వ్యవసాయ రంగ వృద్ధి

9. ఏ ప్రణాళికలో మహలనోబిస్ నమూనాను అమలుపరిచారు? (Civils 2008)

ఎ) మొదటి ప్రణాళిక బి) రెండవ ప్రణాళిక

సి) మూడవ ప్రణాళిక డి) నాల్గవ ప్రణాళిక

10. కనీస క్లిష్ట సమర్థత (Critical minimum effort theory) సిద్ధాంతాన్ని ఎవరు ప్రతిపా దించారు? (Endowment E.O. 2008)

ఎ) హెచ్. రైబిన్‌స్టీన్ బి) రోజిన్‌స్టీన్ రోడాన్

సి) డబ్యు.ఎ. లెవిస్ డి) జె.హెచ్. బొకె

11. ప్రదర్శనా ప్రభావం (Demonstration effect) ను ఎవరు ఉపయోగించారు?

ఎ) జోన్ రాబిన్‌సన్ బి) జె.కె. గాల్‌బ్రైల్

సి) జె.ఎం. కీన్స్ డి) జేమ్స్ డ్యుసెన్ బర్రీ

12. శ్రమ విభజనను మార్కెట్ పరిమితం చేస్తుంద ని చెప్పినవారు? (Endowment E.O. 2008)

ఎ) ఆడమ్‌స్మిత్ బి) జె.బి. సే

సి) డెవిడ్ రికార్డీ డి) ఆల్ఫ్రెడ్ మార్షల్

13. పేదరికపు విషవలయాలు దీనితో ముడిపడి ఉంది? (Endowment E.O. 2008)

ఎ) ఆదాయం, జనాభా బి) పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం

సి) ఉత్పాదకత, ఆదాయం డి) పొదుపు, మూలధనం

14. ఉద్యమదారుడికి దేనితో దగ్గరి సంబంధం ఉంది? (Endowment E.O. 2008)

ఎ) నవకల్పనలు బి) నూతన కల్పనలు

సి) వ్యవహార బాధ్యతలు డి) టేక్-ఓవర్స్

15. 'స్వర్ణ దశలో సంపూర్ణ ఉద్యోగిత సమతౌల్యాన్ని' ఎవరు ప్రతిపాదించారు?

ఎ) జి. మిర్థాల్ బి) జాన్ రాబిన్‌సన్

సి) మార్క్స్ డి) కీన్స్

16. హర్ష్‌మన్ ప్రకారం ముందు-వెనుక అనుబం ధాలు ఎక్కువగా ఉన్న పరిశ్రమ ఏది?

ఎ) ధాన్యం, వస్తువుల కర్మాగారం

బి) ఇనుము, ఉక్కు కర్మాగారం

సి) వస్త్ర పరిశ్రమ డి) గనుల తవ్వకం

17. తక్కువ స్థాయి సమతౌల్యతల సంబంధం ఎవరితో ఉంది?

ఎ) హెచ్. మింట్ బి) ఆర్.ఆర్. నెల్సన్

సి) నర్క్సే డి) లూయిస్

జవాబులు	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17
	C	C	A	C	B	B	C	A	B	A	D	A	C	A	B	B	B

భారత్... మౌలిక సదుపాయాల ఆవశ్యకత

భారతదేశం సాధిస్తున్న అధికవృద్ధి రేటు... అవస్థాపనా సౌకర్యాల ఆవశ్యకతను తెలుపుతోంది. సంస్కరణల కాలంలో... ప్రభుత్వం తన విధానాల్లో మార్పు తీసుకురావడం ద్వారా... మౌలిక సదుపాయాల కల్పనలో ప్రయివేటు రంగానికి అనుమతించింది. పట్టణ ప్రాంతాలలోనే ఎక్కువగా కేంద్రీకృతమైన ఈ సౌకర్యాలు... దేశంలో ప్రాంతీయ అసమానతలు, ఆదాయ అసమానతలకు కారణమయ్యాయి. ఫలన కాలం ఎక్కువగా ఉండే ఈ పెట్టుబడుల విషయంలో... ప్రయివేటు రంగం పాత్ర పరిమితంగా ఉన్నందువల్ల, ప్రభుత్వరంగ పెట్టుబడులు సమర్థనీయం!!

గ్రామీణ ప్రాంతాలలో... అవస్థాపనా సౌకర్యాల (Infrastructure) కల్పనలో ప్రభుత్వరంగ పెట్టుబడులు వచ్చే విధంగా సంస్కరణలు ప్రవేశ పెట్టాలి. సామాజిక న్యాయం ధ్యేయంగా... ప్రభుత్వం ఒకవైపు ప్రయత్నిస్తూనే... అధిక పెట్టుబడులు అవసరమైన అవస్థాపనా సదుపాయాల కల్పనలో ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించాలి. ఆర్థికాభివృద్ధి విధానం లక్ష్యాలను నెరవేర్చాలంటే... ఆర్థికాభివృద్ధి జరగడానికి ముందు, అభివృద్ధి జరుగుతున్నపుడు.. అభివృద్ధి జరిగిన తర్వాత కూడా... ప్రతి దేశంలోను అవస్థాపనా సౌకర్యాల ఆవశ్యకత ఎంతో ఉంది. అభివృద్ధి చెందిన దేశాలు... ఆర్థిక ప్రగతి సాధించడానికి మౌలిక సౌకర్యాలు ఎంతో తోడ్పడ్డాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల ప్రగతి... అవస్థాపనా సౌకర్యాలపై ఆధారపడి ఉంటుంది.

మొదటి ప్రణాళిక నుంచే:

రవాణా, సమాచారం, విద్యుచ్ఛక్తి, నీటిపారుదల, వరదల నివారణ, రుణ సదుపాయాలు... వ్యవసాయరంగంలో అధిక ఉత్పత్తి సాధించడానికి అవసరమైన అవస్థాపనా సౌకర్యాలు. కాగా, ఇంధన వనరులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సదుపాయాలు, మార్కెటింగ్, రోడ్లు, రైల్వేలు, యంత్ర సామగ్రి... పారిశ్రామిక రంగ ప్రగతికి అవసరమైన మౌలిక వసతులు. విద్యా, వైద్య, విజ్ఞాన, సాంకేతిక పరిజ్ఞానం, పారిశుధ్యం మొదలైన వాటిని కూడా అవస్థాపనా సౌకర్యాలుగా భావించవచ్చు. స్వాతంత్ర్యానంతరం అవస్థాపనా సౌకర్యాల లభ్యత, ఆర్థికాభివృద్ధికి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించిన ప్రణాళికా నిపుణులు... మొదటి ప్రణాళిక నుంచే ఈ సౌకర్యాల విస్తరణకు ప్రాధాన్యమిచ్చారు. ప్రణాళికలలో 50% పెట్టుబడిని అవస్థాపనా సౌకర్యాల కోసం వ్యయం చేస్తుండటంతో... ఈ సౌకర్యాల కల్పనలో భారతదేశం అధిక పెరుగుదల రేటును నమోదు చేసుకుంది. మౌలిక వసతుల ఫలన కాలం ఎక్కువ. అందువల్ల ప్రయివేటు రంగ పెట్టుబడులు తక్కువగా ఉంటాయని భావించి.. ప్రభుత్వ రంగ పెట్టుబడులు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల కాలంలో... భారత్ సాధిస్తున్న అధిక వృద్ధి రేటు.. అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధికి ఉన్న అన్ని అవరోధాలు తొలగించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తోంది. విద్యుచ్ఛక్తి, రోడ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్ట్‌లు, టెలికమ్యూనికేషన్స్ ప్రభుత్వ పరిధిలో ఉండేవి. గత రెండు దశాబ్దాలుగా డిమాండ్, సప్లయ్ మధ్య తేడా ఎక్కువగా ఉండటం... క్వాలిటీ ఆఫ్ ఎసెట్స్‌లో తగ్గుదల ప్రభుత్వ విధానంలో మార్పునకు కారణమైంది. ప్రభుత్వం తన విధాన దృక్పథంలో మార్పు తీసుకురావడం ద్వారా... మౌలిక సదుపాయాల రంగంలో ప్రయివేటుకు అనుమతించింది. తద్వారా ప్రభుత్వ, ప్రయివేటు రంగాలు తమ సామర్థ్యాలకు తగిన విధంగా పెట్టుబడులు పెట్టే అవకాశం ఏర్పడింది.

సంస్కరణల యుగం :

1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాక అవస్థాపనా సౌకర్యాల రంగంలో.. ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించింది. 1997లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కంపెనీని రూ.5,000 కోట్ల అధీకృత మూలధనంతో ప్రారంభించారు. రోడ్లు, బ్రిడ్జీలు, పారిశుధ్యం, నీటి సరఫరా, ఎయిర్‌పోర్ట్‌లు, నౌకాయానాలు, రైల్వే ప్రాజెక్ట్‌లను అభివృద్ధి చేసి, నిర్వహించే కంపెనీలకు ప్రభుత్వం పన్నుల విరామాన్ని ప్రకటించింది. ఈ సౌకర్యాల కల్పనలో విదేశీ పెట్టుబడులపై ఉన్న ఆంక్షలు తొలగించారు. ఇంధన రంగంలో, రోడ్లు, బ్రిడ్జ్‌లు, నిర్మాణ రంగం, కొరియర్ సర్వీసులలో... 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతించారు. టెలికమ్యూనికేషన్లు, బ్యాంకింగ్ రంగంలో 74 శాతం; పౌర విమానయానం, బీమా రంగంలో 49% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ప్రభుత్వం అనుమతించింది. నేషనల్ హైవేస్ అథారిటీ కార్పస్‌ను రూ.200 కోట్లకు పెంచడం ద్వారా... స్వదేశీ, అంతర్జాతీయ మూలధన మార్కెట్‌లో పెట్టుబడులు సమకూర్చుకొనే అవకాశం కల్పించారు.

దీపక్ పరేఖ్ కమిటీ:

అవస్థాపనా రంగంలో పెట్టుబడుల ప్రోత్సాహానికి ఉన్న అవరోధాలను గుర్తించి.. వాటి నివారణకు సూచనలు చేసేందుకు ప్రభుత్వం.. 2006లో దీపక్ పరేఖ్ అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 2007, మేలో తన నివేదిక ప్రభుత్వానికి సమర్పించింది. కొన్ని సంస్థాపరమైన, స్థూల ఆర్థికపరమైన అడ్డంకులను వివరించింది.

స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీలో) పొదుపు రేటు పెరుగుతున్నప్పటికీ... ఈ మొత్తం పొదుపులో దీర్ఘకాల పొదుపు తక్కువగా ఉందని కమిటీ అభిప్రాయపడింది. ద్రవ్యబాధ్యత, బడ్జెటరీ యాజమాన్య చట్టం (Fiscal Responsibility and Budget Management Act) ప్రకారం.... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెటరీ మద్దతు పరిధి తక్కువగా ఉండటం.. ప్రభుత్వం ఇచ్చే గ్యారంటీలపై ఉన్న నియంత్రణలు... అవస్థాపనా రంగంలో పెట్టుబడులకు అవరోధంగా ఉన్నాయని కమిటీ పేర్కొంది. ఒకే రంగానికి ప్రాధాన్యత ఇస్తూ.. పెట్టుబడులు పెంచే చర్యలు చేపట్టినపుడు నష్ట భయం ఏర్పడి, ఈ రంగంలో పెట్టుబడులు తగ్గే అవకాశముందని... ఆర్థిక వ్యవస్థలో విదేశీ మూలధన ప్రవాహం కూడా తగ్గుతుందని కమిటీ తెలిపింది. స్వదేశీ రుణ మూలధన మార్కెట్‌ను అభివృద్ధి చేయడం ద్వారా అవస్థాపనా రంగంలో పెట్టుబడులను పెంచడానికి బ్యాంకింగ్, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలను ప్రోత్సహించడం... విదేశీ పెట్టుబడులను ఈ రంగానికి మళ్లించడం.. విదేశీమారక ద్రవ్య నిల్వలను ఈ రంగ అభివృద్ధికి ఉపయోగించడం... బీమారంగ పొటెన్షియల్‌ను ఉపయోగించుకోవడం.. కోశపరమైన నిర్ణయాల ద్వారా మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడుల ప్రోత్సాహానికి చర్యలు తీసుకోవాలని కమిటీ సూచించింది.

అవస్థాపనా సౌకర్యాల లభ్యత :

1950-51 నుంచి 2005-06 మధ్య కాలంలో... బొగ్గు ఉత్పత్తి 32 మిలియన్ టన్నుల నుంచి 437 మిలియన్ టన్నులకు పెరిగింది. 2006-07 ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో.. బొగ్గు ఉత్పత్తిలో వృద్ధి 4.5 శాతం. కాగా 2007-08 ఏప్రిల్-డిసెంబర్‌లో అది 4.9 శాతానికి పెరిగింది. విద్యుత్ ఉత్పత్తి 1950-51లో... 5 బిలియన్ కిలోవాట్లు. కాగా అది 2005-06లో 623 బిలియన్ కిలోవాట్లకు పెరిగింది. ఇదే కాలానికి సంబంధించిన స్టీల్ ఉత్పత్తి 1 మిలియన్ టన్ను నుంచి 44.5 మిలియన్ టన్నులకు చేరుకోగా... సిమెంట్ ఉత్పత్తి 2.7 మిలియన్ టన్నుల నుంచి 148 మిలియన్ టన్నులకు పెరిగింది. పెట్రోల్, చమురు ఉత్పత్తి 0.4 మిలియన్ టన్నుల నుంచి 32 మిలియన్ టన్నులకు; రైల్వే వస్తు రవాణా 73 మిలియన్ టన్నుల నుంచి 666 మిలియన్ టన్నులకు; ముఖ్య నౌకాశ్రయాలలో Cargo handled 19 మిలియన్ టన్నుల నుంచి 424 మిలియన్ టన్నులకు పెరిగింది. 2005-06 నాటికి మొత్తం 142 మిలియన్ల టెలిఫోన్ కనెక్షన్‌లు ఉన్నాయి.2006-07 ఏప్రిల్-డిసెంబర్, 2007-08 ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలాలలో... వివిధ అవస్థాపనా సదుపాయాల ఉత్పత్తి వృద్ధి పరిశీలించగా... స్టీల్ వృద్ధి 11.1 శాతం నుంచి 6.4 శాతానికి; సిమెంట్ వృద్ధి 10.5 శాతం నుంచి 7 శాతానికి; పెట్రోలియం క్రూడ్ 6.1 నుంచి 0.3; పెట్రోలియం రిఫైనరీ 13.2% నుంచి 7.5 శాతానికి తగ్గింది. ఇదే కాలంలో విద్యుత్ ఉత్పత్తిలో వృద్ధి 7.5 శాతం నుంచి 6.6 శాతానికి; రైల్వే సరకుల రవాణా వృద్ధి 9.7 శాతం నుంచి 8.2 శాతానికి తగ్గింది. నౌకాశ్రయాలలో Cargo handling వృద్ధి 8.3 శాతం నుంచి 12.5 శాతానికి పెరిగింది. టెలికాం రంగానికి సంబంధించి వైర్‌లెస్ కనెక్షన్‌ల వృద్ధి 46.9% నుంచి 44.5%కు; మొత్తం టెలిఫోన్ కనెక్షన్‌ల (ఫిక్స్‌డ్‌తో కలిపి) వృద్ధి 33.7% నుంచి 32.6%కు తగ్గింది. 2007-08 ఏప్రిల్, డిసెంబర్ మధ్య కాలంలో... స్టీల్, సిమెంట్, పెట్రోలియం ఉత్పత్తి వృద్ధి రేట్లు తగ్గగా... బొగ్గు ఉత్పత్తిలో కొంత పెరుగుదల కనిపించింది.

ప్రాంతీయ అసమానతలు:

స్వాతంత్ర్యానంతరం వ్యవసాయం, పారిశ్రామిక ఉత్పత్తుల పెరుగుదలకు.. జాతీయ, తలసరి ఆదాయాల పెరుగుదలకు అవస్థాపనా సౌకర్యాలు ఎంతో చేయూతనిచ్చాయి. అయితే, ఈ సౌకర్యాలు ఎక్కువగా పట్టణ ప్రాంతాలలోనే కేంద్రీకృతమవడం వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అసమానతలు పెరిగాయి. వీటి కల్పనలో గ్రామీణ ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురవడం వల్ల సరైన అభివృద్ధిని సాధించలేకపోయాయి. బహుళార్థక సాధక ప్రాజెక్టుల నిర్మాణం, గ్రామీణ విద్యుదీకరణ వల్ల గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములు లబ్ధి పొందారు. కాగా చిన్నతరహా నీటి పారుదల సౌకర్యాల అభివృద్ధికి తగినంత ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో... సన్నకారు రైతులకు మేలు చేకూరలేదు. దేశంలో పారిశ్రామికీకరణ కూడా ఈ సౌకర్యాల కల్పన ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో జరగడంతో ఆయా ప్రాంతాలలో ప్రజల ఉపాధి, ఆదాయాలు పెరిగి... ప్రాంతీయ అసమానతలకు దారితీసింది. విద్యుత్, రవాణా, సమాచారం, విద్య, ఆరోగ్య సౌకర్యాల విషయంలో... అధిక ఆదాయవర్గాల వారే లబ్ధి పొందారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం పట్టణ ప్రాంతాలకు వలసలు పెరిగి... పట్టణాలలో మురికి వాడలు పెరగడం, నివాస సమస్యలు, రవాణా సమస్యలు తలెత్తాయి. గ్రామీణ ప్రాంతాలలో ఈ సౌకర్యాల కల్పనకు ప్రభుత్వ పెట్టుబడులు సమర్థనీయం.

11వ పంచవర్ష ప్రణాళిక :

11వ పంచవర్ష ప్రణాళికలో... లక్షిత వృద్ధిరేటు 9 శాతం సాధించాలంటే... భౌతిక అవస్థాపనా సౌకర్యాలైన విద్యుచ్ఛక్తి, రైల్వేలు,రోడ్లు, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, నౌకాశ్రయాలు, ఎయిర్‌పోర్ట్‌లు, నీటిపారుదల రంగాలకు పెట్టుబడులు పెంచాలి. ఈ సదుపాయాల కల్పనకు వ్యయం చేసిన పెట్టుబడులు... 2006-07లో జీడీపీలో 5 శాతం. కాగా ప్రణాళికాంతానికి ఈ పెట్టుబడులను 9 శాతానికి పెంచాల్సిన అవసరముంది. 2006-07లలో భౌతిక అవస్థాపనా సౌకర్యాలపై పెట్టుబడులు రూ. 20,60,000 కోట్లు అవసరమవుతాయని అంచనా. ఈ మొత్తంలో కేంద్ర ప్రభుత్వ వాటా 37.16 శాతంగా... రాష్ట్ర ప్రభుత్వాల వాటా 32.76 శాతం గాను.. ప్రయివేటు రంగం వాటా 30.07 శాతంగానూ ఉంటుంది. మొత్తం వ్యయంలో రూ.10,64,000 కోట్లను రుణేతర (Non debt) రూపంలోను... రూ. 9,96,000 కోట్లను రుణ రూపంలోను స్వీకరిస్తారు. 2008-09లో లక్షిత పెట్టుబడి (రుణ, రుణేతర రూపంలో కలిపి) రూ. 3,22,000 కోట్లని అంచనా. స్వదేశీ

బ్యాంక్ పరపతి, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, పెన్షన్ అండ్ ఇన్సూరెన్స్ ఫండ్స్, బహిర్గత వాణిజ్య రుణాల రూపంలో పెట్టుబడికి అవసరమైన రుణాన్ని సమీకరిస్తారు!!

అభివృద్ధి పథకాలు

1) స్వర్ణజయంతి గ్రామ్ స్వరాజ్‌గార్ యోజన (SGSY):
సమీకృత గ్రామీణాభివృద్ధి పథకం (IRDP), దాని అనుబంధ పథకాలైన DWACRA, TRY SEM, GKY, MWS, SITRAలను విలీనం చేయడం ద్వారా ఎస్‌జీఎస్‌వై పథకాన్ని 1999, ఏప్రిల్ 1న ప్రారంభించారు. గ్రామీణ పేదలకు ఉద్దేశించిన ఏకై క స్వయం ఉపాధి పథకం ఇది. బ్యాంకు రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందించి ఆదాయాన్ని కల్పించడం ద్వారా దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న వారిని వృద్ధిలోకి తీసుకురావడం ఈ పథకం ప్రధానోద్దేశం. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు 75 : 25 నిష్పత్తిలో ఈ పథకానికి నిధులను సమకూరుస్తాయి.

2) సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన (SGRY):
జవహర్ గ్రామ సమృద్ధి యోజన, ఉపాధి హామీ పథకాలను విలీనం చేసి 2001, సెప్టెంబర్‌లో ఈ పథకాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో అదనపు వేతన ఉపాధిని కల్పించడం దీని ప్రధాన లక్ష్యం. అదనపు ఉపాధి ద్వారా నిరుపేద శ్రామికులకు ఆహార భద్రత కల్పించడమే కాకుండా.. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక ఆస్తులు నిర్మించడం, అవస్థాపనా సదుపాయాల అభివృద్ధికి ఈ పథకం ఉపకరిస్తుంది. ఈ పథకం వ్యయంలో నగదు, ఆహారధాన్యాలు భాగాలు. రాష్ట్రాలకు అవసరమైన ఆహార ధాన్యాలను కేంద్రం ఉచితంగా సరఫరా చేస్తుంది. ఈ పథకం అమలుకు కావాల్సిన నగదు లో 75 : 25 శాతం వంతున కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. 2008, ఏప్రిల్ 1 నుంచి ఇది పూర్తిగా NREGSలో విలీనమైంది.

3) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (NREGS):
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2006, ఫిబ్రవరి 2న ప్రారంభమైంది. జాతీయ పనికి ఆహార పథకం, సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన పథకం విలీనం చేయడం ద్వారా ఈ పథకాన్ని రూపకల్పన చేశారు. మన రాష్ట్రంలోని అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామంలో ప్రధానమంత్రి డా.మన్మోహన్ సింగ్ ఈ పథకాన్ని ప్రారంభించారు. ప్రారంభంలో ఈ పథకాన్ని దేశంలోని 200 వెనుకబడిన జిల్లాల్లో ప్రవేశపెట్టగా, తర్వాత దశలో 330 జిల్లాల్లో అమలు చేశారు. 2008-09 బడ్జెట్‌లో దేశం మొత్తం జిల్లాలకు ఈ పథకాన్ని విస్తరించారు. ప్రతి పేద కుటుంబంలోని నైపుణ్యం లేని శ్రామికులకు ఏడాదిలో కనీసం 100 రోజులు పని కల్పించడం దీని ఉద్దేశం. పని కోరిన 15 రోజుల్లో పని కల్పించ కపోతే మొదటి 30 రోజులు వేతన రేటులో నాలుగో వంతు నిరుద్యోగ భృతి చెల్లించాలి. మిగిలిన 70 రోజులకు వేతనంలో సగం నిరుద్యోగ భృతి చెల్లించాలి. పని చేసిన తర్వాత ఏ పరిస్థితిలోనూ వేతన చెల్లింపు 15 రోజులకు మించి ఆపరాదు. పని ప్రదేశం వద్ద రక్షిత మంచినీరు, నీడ, చిన్నపిల్లలకు క్రెచ్ సదుపాయాలు కల్పించాలి. 2007-08 ఆర్థిక సంవత్సరంలో దీని కింద చేపట్టిన పనుల్లో 49 శాతం పనులు నీటి సంరక్షణకు సంబంధించినవే. వీటి ప్రణాళిక మానిటరింగ్, సోషల్ ఆడిట్‌లో గ్రామసభలదే ముఖ్య పాత్ర. దేశంలో ప్రస్తుతం అమలవుతున్న ఏకైక ఉపాధి పథకం ఇదే. ఈ పథకానికి అయ్యే వ్యయంలో 90 శాతం కేంద్రం భరిస్తుంది. ఈ పథక రూపకల్పనలో బెల్జియం ఆర్థికవేత్త జాన్‌డ్రీజ్ ప్రత్యేక కృషి చేశారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ దీన్ని అమలు చేస్తోంది.

4) ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (PMGSY):
వంద శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో 2000, డిసెంబర్‌లో ప్రారంభమైంది. 500 అంత కంటే ఎక్కువ జనాభా కలిగి రోడ్డు సౌకర్యం లేని 1.6 లక్షల నివాస ప్రాంతాలకు అన్ని కాలాలకు ఉపయోగపడే విధంగా రోడ్డు సౌకర్యం కల్పించడం దీని ఉద్దేశం. కొండ ప్రాంతాలు, ఎడారి ప్రాంతాల్లో 250 కంటే ఎక్కువ జనాభా ఉంటే రోడ్డు నిర్మిస్తారు.

5) భారత్ నిర్మాణ్:
గ్రామీణ ప్రాంతాల్లో అవస్థాపనా సదుపాయాలు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు 2005-06 సంవత్సరంలో భారత్ నిర్మాణ్ పథకం ప్రారంభించారు. ముఖ్యంగా... కింది తెలిపిన ఆరు అంశాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ఉద్దేశించింది.
1. గ్రామీణ గృహ నిర్మాణం
2. నీటిపారుదల
3. తాగునీరు
4. గ్రామీణ రోడ్లు
5. గ్రామీణ విద్యుదీకరణ
6. గ్రామీణ టెలి సౌకర్యం

6) ఆమ్ ఆద్మీ భీమా యోజన (AABY):
2007 అక్టోబర్‌లో ఈ నూతన పథకం ప్రారంభ మైంది. గ్రామీణ భూమి లేని కుటుంబ యజమాని సహజంగా లేదా ప్రమాదవశాత్తూ మరణించినా, పాక్షికంగా లేదా శాశ్వతంగా అంగవైకల్యం పొందిన వారికి బీమా కల్పించేందుకు ఉద్దేశించినది. ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ. 75,000/-, సహజ మరణానికి రూ. 37,500 బీమా వర్తిస్తుంది. దీనికి సంవత్సరానికి ఒక్కొక్క సభ్యుడు రూ. 200 ప్రీమియం చెల్లించాలి. ప్రీమియంలో 50 శాతం కేంద్రం, మిగిలినది రాష్ట్రం భరిస్తుంది.

7) రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన :
ఈ పథకాన్ని 2007, అక్టోబర్ 1న ప్రారంభించారు. దారిద్ర్యరేఖకు దిగువ ఉండి, అసంఘటిత రంగంలో పనిచేసే శ్రామికులు, వారి

కుటుం బాలకు ఈ పథకం వర్తిస్తుంది. కుటుంబాంకు సంవత్సరానికి రూ. 30,000 విలువైన బీమా సౌకర్యం కల్పిస్తారు. ఈ పథకానికి అయ్యే వ్యయాన్ని 75 : 25 శాతం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు భరి స్తాయి.

8) ఉజ్జ్వల పథకం:

లైంగిక వృత్తిని నిరోధించి పునరావాసం కల్పించే ధ్యేయంతో 2007, డిసెంబర్‌లో ఈ పథకాన్ని ప్రారంభించారు.

9) స్వర్ణజయంతి షహరి రోజ్‌గార్ యోజన (SJSRY):

పట్టణాల్లో అమల్లో ఉన్న NRY, UBSP, PMIUPEP పథకాల ను విలీనం చేసి 1997, డిసెంబర్‌లో దీన్ని ప్రారంభించారు. దీనిలో పట్టణ స్వయం ఉపాధి పథకం (USEP), పట్టణ వేతన ఉపాధి పథకం రెండు భాగాలుగా ఉన్నాయి. దీనికి కేంద్ర, రాష్ట్ర నిధులు 75 : 25 శాతంగా అందిస్తారు. పట్టణ ఏకైక స్వయం వేతన ఉపాధి పథకమిది.

10) వాంబే వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన (VAMBAY):

పట్టణ మురికివాడల్లోని దారిద్ర్య రేఖ దిగువన జీవించే వారికి గృహా లు నిర్మించేందుకు 2001, డిసెంబర్‌లో 'వాంబే'ను ప్రారంభించారు. ఆరో గ్యకర వాతావరణాన్ని ఏర్పరిచేందుకు 'నిర్మల్ భారత్ అభి యాన్' కింద సామాజిక మరుగుదొడ్లు నిర్మించడం దీనిలో ఒక అం శం. కేంద్ర ప్రభుత్వం దీనికి 50 శాతం రాయితీ ఇవ్వగా, మిలిగిన వ్యయాన్ని రాష్ట్రాలు భరిస్తాయి. 2005లో వాంబే Integrat-ed Housing and Slum Development Programme (IHSDP)లో విలీనమైంది.

11) జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ (JNNURM) :

2005-06లో ఈ పథకం ప్రారంభమైంది. దీనిలో రెండు ప్రధాన అంశాలు ఉన్నాయి.

1. పట్టణ పేదలకు మౌలిక సౌకర్యాలు కల్పించే పథకం (BSUP) దేశంలో ఎంపిక చేసిన 63 నగరాల్లో పేదలకు గృహ నిర్మాణం, అవస్థాపనా సదుపాయాలు కల్పించడం దీని ఉద్దేశం.
2. IHSDPని, BSUPతో పాటు 2005, డిసెంబ ర్‌లో ప్రారం భించారు. BSUP అమలు కాని ఇతర నగరాల్లో గృహాల నిర్మాణం, మురికివాడలను మెరుగుపర్చడం దీని ఉద్దేశం.

12) జాతీయ సామాజిక సహాయ పథకం (NSAP):

సామాజిక భద్రతను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు వంద శాతం సహాయం చేస్తుంది. ఇది 1995లో ప్రారంభమైంది. దీనిలో 3 అంశాలు ఉన్నాయి.

ఎ)**జాతీయ వృద్ధాప్య పింఛను పథకం** (NOAPS): 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు నెలకు రూ. 75 పింఛన్ అందించేవారు. తర్వాత దీన్ని రూ.200కి పెంచారు.

బి) **నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం** National Family Benefit Scheme (NFBS): దారిద్ర్య రేఖకు దిగువ నున్న కుటుంబాల్లో ప్రధాన ఆహార సంపాదకుడు చనిపోతే రూ.10,000 సహాయం అందిస్తారు.

సి) **నేషనల్ మెటర్నిటీ బెనిఫిట్ స్కీం** (National Mater-nity Benefit Scheme) NMBS: దారిద్ర్యరేఖకు దిగువ నున్న 19 ఏళ్ల దాటిన గర్భిణులకు ఆరోగ్య సంరక్షణ కోసం రూ.500 ఆర్థిక సహాయం అందిస్తారు.

13) అంత్యోదయ అన్న యోజన:

నిరుపేదలను గుర్తించి, వారికి అధిక రాయితీలతో ఆహారధాన్యాలను అందించేందుకు 2000, డిసెంబర్‌లో ఈ పథకం ప్రారంభమైంది. కిలో గోధుమలు రూ. 2కు, కిలో బియ్యం రూ.3కు పేద కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ కింద అందిస్తారు. ప్రారంభంలో కుటుంబానికి 25 కేజీలు అందించేవారు. తర్వాత ఇది 35 కేజీలకు పెంచారు.


14. ప్రధానమంత్రి గ్రామోదయ యోజన(PMGY):

ప్రధానంగా.. ప్రాథమిక ఆరోగ్యం, ప్రాథమిక విద్య, గ్రామీణ ఆవా సం, గ్రామీణ తాగునీరు, పౌష్టికాహారం అంశాల్లో మానవాభ్యుదయ సాధనలో భాగంగా 2000-01లో రూపుదిద్దుకున్న పథకమిది. ఈ అయిదింటితోపాటు 2001లో గ్రామీణ విద్యుదీకరణను కూడా చేర్చారు.

15) కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ(KGBV):

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన బాలికలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, ప్రాథమికోన్నత స్థాయిలో రెసిడెన్షియల్ పాఠశాలలు నెలకొల్పేందుకు 2004లో దీన్ని ప్రారంభించారు. రెండేళ్లపాటు ప్రత్యేక పథకంగా నిర్వహించిన ఈ పథకాన్ని 2007, ఏప్రిల్ 1 నుంచి సర్వశిక్ష అభియాన్ (SSA)లో విలీనం చేశారు.

భారత్.. పేదరిక నిర్మూలన



దశాబ్దాల పాటు విదేశీ పాలన.. జనాభా అనూహ్యంగా పెరిగిపోవడం.. దేశంలో పేదరికానికి ప్రధాన కారణం. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. పేదరిక నిర్మూలనపై దృష్టిసారించాయి. పలు పేదరిక నిర్మూలన, గ్రామీణాభివృద్ధి పథకాలు చేపట్టాయి. సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు పిపేర్ అయ్యే అభ్యర్థులు పేదరిక నిర్మూలన అంశాన్ని అధ్యయనం చేయడం ఉపయుక్తం!!

పేదరికం, నిరుద్యోగిత.. దేశాభివృద్ధికి పెద్ద సమస్యగా పరిణమించాయి. ఈ పదాలకు నిర్వచనాలు కూడా తరచూ మారుతున్నాయి. కనీస జీవన ప్రమాణాలు లోపించడం, పౌష్టికాహార లోపం, నిరక్షరాస్యత, మానవాభివృద్ధిలో వెనుకబాటుతనం మొదలైనవి పేదరికం లక్షణాలుగా చెప్పవచ్చు. పేదరికాన్ని నిర్మూలించే ప్రయత్నాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచే ప్రారంభించాయి.. భారత్‌లో పేదరికాన్ని రెండు రకాలుగా నిర్వచిస్తారు.
1) నిర్దిష్ట పేదరికం, 2) సాపేక్ష పేదరికం

నిర్దిష్ట పేదరికం :

కనీస జీవన ప్రమాణాల్లోని వివిధ అంశాలను నిర్దిష్ట పరిమాణంలో పరిగణనలోకి తీసుకొని, ఆ పరిమాణానికి దిగువున ఉన్న వ్యక్తులందరినీ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారిగా గుర్తిస్తారు.

సాపేక్ష పేదరికం :

ఇది వివిధ వ్యక్తులు లేదా సమూహాలకు అందుబాటులో ఉన్న వనరులు, వేతనం, సంపద తదితరాల్లో... అసమానతల ఆధారంగా సాపేక్ష పేదరికాన్ని లెక్కిస్తారు. భారత్‌లో పేదరికం సాధారణంగా నిర్దిష్ట పేదరికం.

పేదరిక లెక్కింపు:

నిర్దిష్ట పేదరికాన్ని లెక్కించేందుకు 'దారిద్ర్యరేఖ' అనే భావనను దాదాభాయి నౌరోజి మొదటిసారిగా అనే గ్రంథంలో జైల్లో ఖైదీల కనీస పౌష్టికాహారం ఆధారంగా నిర్వచించారు. 1940, 1950లలో కలకత్తాలోని మహలనోబిస్.. శాంపుల్ సర్వే ద్వారా పేదరికాన్ని లెక్కించే ప్రయత్నం చేశారు. ఈ పద్ధతినిలో ప్రవేశపెట్టారు.

ఓఝూ కమిటీ నివేదిక :

ఈ కమిటీ ఆహారంలో దినసరి పౌష్టిక విలువల ఆధారంగా దారిద్ర్యరేఖను నిర్వచించింది. రోజుకు ప్రతి వ్యక్తికి 2250 కేలరీలను ప్రామాణికంగా తీసుకుంది. ఈ విలువను రూపాయి మారకంలోకి మార్చినందుకు 1960-61 ధరల ప్రకారం.. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.15 నుంచి రూ.18, గ్రామీణ ప్రాంతాల్లో రూ.8 నుంచి రూ.11 నెలసరి వేతనంకంటే తక్కువ ఉంటే దాన్ని దారిద్ర్యరేఖగా నిర్వచించారు. ఆ ప్రకారం ..1967-68లలో గ్రామీణ ప్రాంతాల్లో 70 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.

దండేకర్-రథ్ అధ్యయన బృందం:

దండేకర్-రథ్ బృందాన్ని ప్రణాళిక సంఘం నియమించింది. ఓఝూ కమిటీ సూచించిన 2250 కేలరీల దినసరి పౌష్టిక విలువతో ఈ బృందం ఏకీభవించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు.. వారు నిర్వహించే విధులను అనుసరించి వేర్వేరు పౌష్టిక విలువల ఆధారంగా దారిద్ర్యరేఖను నిర్వచించాలని సూచించింది. 1968-69 ధరల ప్రకారం... గ్రామీణ ప్రాంతాల్లో సంవత్సరానికి రూ.324, పట్టణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.486 కంటే తక్కువ ఆదాయాన్ని

దారిద్ర్యరేఖగా పేర్కొంది. దీన్ని అనుసరించి గ్రామీణ ప్రాంతాల్లో 40% ప్రజలు, పట్టణ ప్రాంతాల్లో 50% కంటే అధిక జనాభా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.

మాంటెక్ సింగ్ అహ్లువాలియా అధ్యయనం:

1956-57 నుంచి 1973-74 మధ్యకాలంలో పేదరిక పరిమాణంలో వచ్చిన మార్పులను మాంటెక్ సింగ్ అహ్లువాలియా అధ్యయనం చేశారు. 1960-61 ధరల ప్రకారం... గ్రామప్రాంతాల్లో రూ.15 ను, పట్టణప్రాంతాల్లో రూ.20 నెలసరి వ్యయాన్ని దారిద్ర్యరేఖగా పరిగణించారు. స్థూల జాతీయోత్పత్తిని పెంచడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చని ఆయన ప్రతిపాదించారు.

ఏడవ ఆర్థిక సంఘం నివేదిక:

ఈ సంఘం పేదరికాన్ని లెక్కించేందుకు ''విస్తృత దారిద్ర్యరేఖ'' అనే భావనను ప్రతిపాదించింది. (Augmented Poverty line). దీనిలో సూచించిన వివిధ అంశాలు... సురక్షిత నీటి సరఫరా, కనీస విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, పౌష్టికాహారం, రోడ్డు వసతి. ఆయా అవసరాల కోసం ప్రతీవ్యక్తి పెట్టే కనీస నెలసరి వ్యయం ఆధారంగా దారిద్ర్యరేఖను నిర్వచించాలి. 1970-71 ధరల ఆధారంగా... 52% జనాభా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లుగా ఈ సంఘం లెక్కించింది.

మిన్హాస్ అధ్యయన బృందం :

మిన్హాస్, జైన్, టెండూల్కర్ సభ్యులుగా ఉన్న ఈ బృందం... కొనుగోలు సామర్థ్యం ఆధారంగా దారిద్ర్యరేఖను నిర్వచించింది.

లక్డవాలా కమిటీ:

లక్డవాల కమిటీని 1989లో ప్రణాళికా సంఘం నియమించింది. ఈ కమిటీ తన నివేదికను 1993లో సమర్పించింది. సమాజంలో వివిధ వర్గాల కొనుగోలు సామర్థ్యాన్ని గుర్తించేందుకు ప్రమాణాలైనను ఉపయోగించి, దారిద్ర్యరేఖను నిర్వచించింది. కొనుగోలు సామర్థ్యం ఆధారంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.49, పట్టణ ప్రాంతాల్లో రూ.57 నెలసరి వ్యయాన్ని దారిద్ర్యరేఖగా సూచించింది. ఈ గణాంకాల ప్రకారం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజల శాతం 1983లో 45%కు 1988లో 39.3%కి తగ్గినట్లుగా కనిపిస్తోంది. గతంలో వినియో గించిన గణాంకాలకు, లకడావాలా కమిటీ గణాంకాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది.

6వ పంచవర్ష ప్రణాళిక:

పౌష్టిక విలువలను ప్రామాణికంగా తీసుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేర్వేరు దారిద్ర్యరేఖలను సూచించింది. గ్రామ ప్రాంతాల్లో రోజుకు 2400 కేలరీలను, పట్టణ ప్రాంతాల్లో 2100 కంటే తక్కువ కేలరీలను దారిద్ర్యరేఖగా ప్రతిపాదించింది.

2007 ముఖ్యమంత్రుల సదస్సు:

దారిద్ర్యరేఖను నిర్వచించేందుకు ఏడు కనీస ప్రాథమిక సేవలను ముఖ్యమంత్రుల సదస్సు ప్రామాణికంగా సూచించింది.

అవి..

1) పౌష్టికాహారం, 2) విద్య

3) ఆరోగ్యం 4) సురక్షిత మంచినీరు

5) కనీస గృహవసతి 6) డ్రైనేజీ సౌకర్యాలు

7) రోడ్డు రవాణా సౌకర్యాలు

ప్రస్తుతం భారతదేశంలో పౌష్టిక విలువల ఆధారంగా పేదరికాన్ని లెక్కిస్తున్నారు. అయితే, ఎక్కువ శాతం మంది నిరక్షరాస్యులు గల భారత్ వంటి దేశాల్లో దినసరి పౌష్టిక విలువలను లెక్కించడం కష్టం. అందువల్ల పౌష్టిక విలువల పరిమాణాన్ని రూపాయి విలువలోకిమార్చి దారిద్ర్యరేఖను లెక్కించాల్సి ఉంటుంది. రూపాయి విలువ, ద్రవ్యోల్బణం వల్ల నిరంతర మారుతూ ఉండటంతో దారిద్ర్యరేఖను ఏడాదికి ఒకసారైనా నిర్వచించాల్సి ఉంటుంది.. స్వాతంత్ర్య అనంతరం అనేక పేదరిక నిర్మూలనా పథకాలను అమలు చేసినప్పటికీ పేదరిక నిర్మూలనను సాధించలేకపోవడానికి కారణం పేదరికాన్ని సరైన రీతిలో నిర్వచించలేకపోవడమే!!